వ్యాస కౌముది





# ఆముక్తమాల్యద

వనం వేంకట వర ప్రసాదరావు

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

అనితరసాధ్యమైన శైలిలో గోదాదేవి అందచందాలను వర్ణించాడు శ్రీకృష్ణదేవరాయలు. గోదాదేవి సౌందర్యాన్ని శృంగార రసభరితంగా వర్ణించాడు. ప్రబంధ సంప్రదాయం ప్రకారం నాయికల సౌందర్య వర్ణన కొత్తదేమీ కాదు, కానీ రాయలు వర్ణించిన తీరు, ఆయన తీసుకొచ్చిన పోలికలు వేరెక్కడా లేనివి, ఆలోచింపజేస్తూ ఆనందింపజేసేవి.కొన్నిటిని పరిశీలిద్దాము. కనుల వర్ణన తర్వాత ఆమె నాసికను వర్ణిస్తున్నాడు.

నాసాచంపకతన్సుగంధ మచటన్ రా భృంగముల్ గ్రోల సం
త్రాసం బందియు బల్కుచో నలము వక్త్రం బేల నా నేల యం
దే సౌరభ్యము లేదు? కుందములు గావే దంతముల్గాని నా
డాసక్తిన్ ప్రతిబింబ దంభమున నేలా వరాల దజ్జాతికిన్?

ఆమె ముక్కు సంపెంగలా ఉన్నది. ముక్కును సంపెంగతో కవులు పోల్చడంలో ఒక చమత్కారము ఉన్నది. సంపెంగ పూవును కాడను పైకి ఉండేట్లు దళములు క్రిందికి ఉండేట్లు చేసి చూస్తే కాడలాంటి సన్నని పొడవైన ముక్కు, దళముల లాంటి ముక్కుపుటలు అని పోలిక అని అర్థం అవుతుంది. సరే, ముక్కు సంపెంగలా ఉన్నది. సువాసనలను వెదజల్లే ఆమె ముఖానికి ముసురుకుందామని తుమ్మెదలు ఆశపడడం జరుగుతున్నది. కానీ ముక్కు సంపెంగ అయ్యేప్పటికి వాటికి ఆశాభంగము అవుతున్నది, ఎందుకంటే సంపెంగ పూల వాసన తుమ్మెదలకు పడదు. ఐతేమాత్రం వాటికి ఊరటగా ఆమె ముఖంలో ఏ సౌరభము లేదని? అన్ని సౌరభాలూ రాశిపోసుకున్న అందగత్తె ఆమె. ఆమె దంతములు మొల్లలు, ఆమె మాట్లాడుతున్నప్పుడు ఆ దంతముల సౌరభము ఎగసిపడుతుంటే, ఆ సౌరభానికి మత్తెక్కి ఆమె ముఖానికి ముసురుకుంటున్నాయి తుమ్మెదలు.

తెల్లని మొల్లల లాంటి స్వచ్ఛమైన ఆమె దంతములలో ఎగురుతున్న తుమ్మెదల ప్రతిబింబాలు కనిపిస్తున్నాయి! ఆ పరిమళము కోసం కాకుంటే, తుమ్మెదలు ఎందుకు ముసురుకుంటాయి ఆమె ముఖానికి, అద్దంలో అందచందాలు చూసుకున్నట్లు ఆమె దంతములపై తమ ప్రతిబింబాలు చూసుకోడం అనే వంకతో ఆమె దంతముల పరిమళం కోసమే ఆ తుమ్మెదలు ముసురుకుంటున్నాయి.

శంఖ సామ్యమ్ము రా మున్ను జలజభవుడు
సరసిరుహపత్ర నేత్ర కంధర యొనర్చె
జవ్వనము వచ్చి వెండి సాక్షాత్కరించు
శంఖమున చేసె నును గంధసార చర్చ

ఆమెను చేసేప్పుడే బ్రహ్మదేవుడు ఆమె కంఠము శంఖాన్ని పోలేట్లుగా ఉండేట్లు చేశాడు. ఇంతలో ఆమెకు యవ్వనం వచ్చింది. గంధపు పూత తెచ్చింది. దాంతో నిజంగానే శంఖం ఐపోయింది ఆమె కంఠం. బాల్యం విడిచి యవ్వనం రావడంతో అలంకరణ, సోకులు తెలిశాయి కనుక గంధం పూసుకోవడం మొదలైంది, దాంతో ఆకారంలోనే కాక రంగులో, అందంలో కూడా నిజంగానే శంఖం ఐంది ఆమె కంఠం.

కమలదళేక్షణ సంగీ
తమున నిగుడు మంద్ర మధ్య తార త్రి స్థా
నములకు దీర్చిన రేఖల
క్రమమగు రేఖా త్రయమున గంఠం బమరున్

ఆ పద్మాక్షి పాడుతున్నప్పుడు సంగీతంలో ఉండే మంద్ర, మధ్య, తారా స్థాయిలకు ఆమె కంఠం పుట్టుకస్థానం అని చెప్తున్నట్లుగా ఆమె కంఠం మీద ముచ్చటగా మూడు ముడుతలు ముద్దుగా ఉన్నాయి. అసలే నాదానికి శ్రేష్ఠమైన శంఖం కదా ఆమె కంఠం, ఆ శంఖానికి ఉన్నట్లే, ఆమె పాడేప్పుడు సంగీత శాస్త్రం నిర్దేశించినట్లే మూడు స్థాయిలు ఆమె గొంతుకలో పుట్టాయి అన్నట్లుగా మూడు ముడుతలు ఆమె కంఠంమీద ఉన్నాయి.ఇందులో యింకొక చమత్కారం ఏమిటంటే, స్త్రీకి కంఠం మీద మూడు ముడుతలు ఉండడం శీలానికి, పాతివ్రత్యానికి చిహ్నం, అదే పురుషులకు ఉంటే ఠీవికి రాచరికానికి చిహ్నం అని శరీర సాముద్రికాశాస్త్ర సూచన.

లలన మృదు బాహుబిసలతలు గడగి
బిసలతా శ్రీలనెల్లను వెస హరించె
మరి హరింపంగ గా యవి నెరులు విరిగి
సారె దనుయాత్ర దంతుల జరపుచుండు

ఆమె బాహువులు పొడవుగా, సున్నితంగా తామర తూడుల్లా ఉన్నాయి. ఆమె బాహువుల నాజూకుదనం, అందం తామర తూడుల 'శ్రీ'ని, వాటి వైభవాన్ని, ప్రతిష్టను కాజేశాయి. వాటి నడుములు విరిగిపోయాయి, వెన్నులు చచ్చుబడ్డాయి, తూడులు వాలిపోయాయి, దాంతో ఆ తామరలు తూడుల మధ్యన ఉండే సన్నని దారములాంటి దాంతోనే జీవనం గడుపుకోవడం మొదలెట్టాయి, చేసేదిలేక! ఆమె 'బిసతంతుతనీయసీ'అని పొగడబడిన 'అమ్మవారి' ప్రతిరూపమే కదా మరి!

**తళుకొత్తున్ భుజ కీర్తి వజ్ర ఘృణిసూత్ర స్యూత హార స్ఫుర**

**త్కళికా చిత్ర కుచద్వయోపరి గలాధస్స్వల్పవిస్తార దై**

**ర్ఘ్య లసత్తిర్యగురస్తటం బను వివాహాంచన్మనో జాత పా**

**టల దంతచ్ఛదబోడబాసికము దండల్వోలె గేళ్ళింతికిన్**

గోదాదేవి కంఠము క్రిందుగా వక్షస్థలం వరకూ ఉన్న శరీర ప్రదేశం విశాలమైనది, సుందరమైనది. అది చూడడానికి, మన్మథుడు రతీదేవిని వివాహము చేసుకున్నపుడు రతీదేవికి కట్టిన బాసికంలాగా ఉన్నది. అటుప్రక్క ఇటు ప్రక్క పొడవైన, వజ్రములు, హారములు పొదిగిన కేయూరములతో తళతళలాడే సుందరమైన, కోమలమైన బాహువులు, వ్రేళ్ళాడుతున్న పూలహారాలలాగా ఉన్నాయి.

**ఒదవెడు జవ్వనంబు వెలికొత్తగ బయ్యెద సిగ్గు గూడి బి**

**ట్టదుమగ లేత లొాట దిగ నాకకుమీరను లేక వక్షపుం**

**జదుపున బ్రక్కలన్మెరసి చప్పటలై మరి లావుగూడ బై**

**బొదలె ననంగ బిక్కటిలె బొల్తుక చన్నులు నాడునాటికిన్**

ఆమెకు యవ్వనము వచ్చి కూడింది. దానితోపాటు పుట్టుకొచ్చిన చన్నులను ఆ యవ్వనం పైకి, బయటకు నెట్టేసింది. కానీ యవ్వనంతో పాటే వచ్చిన సిగ్గు పైటను తెచ్చిపెట్టింది. ఆ పైట చన్నులను అదిమిపెట్టింది, బిగించి పట్టింది. దానితో పాపం ఆ వక్షోజములకు లోపలికి పోవడానికీ బయటకు రావడానికీ వీలుకాక, ప్రక్కలకు వ్యాపించినట్లు ముద్దలుగా ప్రక్కలకు వ్యాపించి, నానాటికీ విశాలములు అయినాయి.

**వృతరఘూత్తమ శాపమొక్కింత విడిచి**

**విడిచి కడకేగ నప్పుడప్పుడకవిసెడు**

**చక్రయుగ మన రొమ్మొయ్యనాక్రమించి**

**కొమిరెచన్నులు పృథుచూచుకముల నమరె**

శ్రీరాముడు సీతాదేవి వియోగాన్ని అనుభవిస్తున్నప్పుడు చక్రవాక పక్షులకు శాపం ఇచ్చాట్ట. నేను నా ప్రియురాలి వియోగాన్ని అనుభవిస్తుంటే మీరు హాయిగా సంయోగానందాన్ని నా కన్నుల ఎదురాగానే అనుభవిస్తూ, నన్ను ఉడికిస్తూ వెక్కిరిస్తూ బాధిస్తున్నారు, భడవల్లారా, మీకు రాత్రిపూట ఎడబాటు కలుగుగాక, పగటిపూటే మీకు ఒకరినొకరు చూసుకోడం, కలుసుకోడం జరుగుగాక అని శాపం ఇచ్చాట్ట. ఆ శాప ప్రభావం వలన పగటిపూట కలుసుకున్న చక్రవాక పక్షులు ఆనందంగా కౌగలించుకుని ముక్కులు రాసుకున్నట్లు గోదాదేవి వక్షోజములు ప్రక్కలకు పెరిగి పెరిగి ఒకదానినొకటి ఒరుసుకుంటున్నాయి. ఆ చక్రవాక పక్షుల ముక్కుల లాగా ఆమె చూచుకములు రాసుకుంటున్నాయి! శ్రీరాముని గాథలోని పౌరాణిక అంశాన్ని, ప్రకృతిలోని ఒక విచిత్రమైన విషయాన్ని కలిపి ఈ పద్యంలో అందంగా

పొదిగాడు శ్రీకృష్ణదేవరాయలు. చక్రవాక పక్షులు సూర్యోదయముకాగానే ఒకదానిని ఒకటి చేరుకొని మురిసిపోవడం వాటి జీవన విధానం. రాత్రిళ్ళు అవి చీకటిలో విడిపోయి, ఒకదానికోసం మరొకటి దిగులుపడి, తెల్లవారగానే గూడును జోడును చేరుకోవడం అనేది భారతీయ కవిలోక సంప్రదాయం. మహానుభావుడు మయూరుడు కూడా తన 'సూర్యశతకం' లో ఈ అంశాన్ని వర్ణిస్తూ అద్భుతమైన శ్లోకాన్ని చెప్పాడు. ఇంతటి సమస్త శాస్త్ర పరిచయము రాయలవారిది.

**తా రె ట్లట్లుగ దమ్ముం**

**జేరిన ముత్తెంపుసరుల జేడియచన్నుల్**

**లోరెంట లుడిపె ఘనమగు**

**వారు నిజార్జవము జేరు వారికి నీరే**

ఉత్తములైనవారు వారిని ఆశ్రయించిన వారికి తమ ధైర్యాన్ని, సత్త్వాన్ని, లక్షణాలను అందించినట్లు, యజమానుల లక్షణాలు సేవకులకు వచ్చినట్లు గోదాదేవి వక్షోజాలను ఆశ్రయించిన ఆభరణాలకు ఆ వక్షోజాల లక్షణాలు వచ్చాయి. విపరీతమైన వైశాల్యం వలన ఆ వక్షోజాలు ఒకదానికొకటి అంటుకుపోయాయి. ఆమె ధరించిన ఆభరణాలు ఆమె వక్షోజాల మధ్యలో ఇరుక్కుపోవడం వలన, పేటలన్నీ ఒక్కటిగా ముడిపడి, ఒక్కటై పోయాయి. యిదీ రాయల వర్ణనా వైదుష్యం, విచిత్రమైన ఊహలకు పోలికలకు ఉదాహరణ.

(తరువాయి వచ్చే సంచికలో)

Post your comments